# పూర్ణమిదం తాతగారు

రెండు వారాలు సాగిన వేట ఫలించింది. రెండు గదులు, వంటగది, బాల్కనీ ఉన్న వాటా ఒకటి మేడమీద అద్దెకు దొరికింది. ఉదయాన్నే ముందుగా అద్దె చెల్లించి, తాళం వేసుకుని తృప్తిగా ఆఫీసుకి చేరాడు రాంబాబు.

ఉత్తరం ఆఫీసు అడ్రసుకి రానే వచ్చింది. "ఏమిటి రామూ! ఇంకా ఇల్లే దొరకలేదా ? లేక ఇంత వేగం నేను రావడం ఇష్టంలేదా ?" అన్న వాక్యాలతో మొదలైన ఆ ఉత్తరాన్ని చదువుకుంటూ మనసు తీరా నవ్వుకున్నాడు.

అలా ఉత్తరం వచ్చినందుకు ఆశ్చర్యంలేదు. రాకపోతేనే ఆశ్చర్యపోవాలి. అది రాధశైలి. ఆ చొరవా, ఆ ఏకవచన ప్రయోగం, చిన్ననాటి నుంచీ తనమీద చూపిన ఆ సాధికార ధోరణి రాధనీ రాంబాబునీ మూడు ముళ్లతో ఏకం చేశాయి.

తొలిరేయి ముచ్చట కళ్ళకు కట్టినట్టే జ్ఞప్తికి వచ్చింది. జలతారు అంచు తెల్లచీరలో పేర్చుకున్న మల్లెలరాశిలా వచ్చి పాలగ్లాసుతో నుంచున్న రాధను చూస్తూ, ఒక్కక్షణం మాటలేకుండా మిడిగుడ్లేసుకుని నిశ్చలంగా ఉండిపోయాడు.

"అదేం అలా అయిపోయావ్. నేన్నీకు నచ్చలేదా ఏం ?" అని గద్దించగానే తేరుకుని చేటంత మోహంతో వాటేసుకున్నాడు.

" మరేంలేదు. ఏ అల్లరీ పెట్టకుండా పాతకాలపు పెళ్ళికూతురు వేషంలో ఎదురైతే ఎందుకో భయం వేసింది. ఇక వాళ్ళు చెప్పారు. వీళ్ళు చెప్పారంటూ ఏకవచన ప్రయోగం మానేసి అండీలు - కుండీలూ వారుస్తావేమో, మనమధ్య అలవాటులేని దూరాన్ని పెంచుతావేమో అని భయపడ్డానుసుమీ" - అన్నాడు బొమ్మలా ఉండిపోయిన రాంబాబు.

ప్రమోషన్ మీద కలిగిన స్థానచలనం కారణంగా ఉన్న ఊరు విడిచి ఒక్కడే మహానగరం వచ్చి గూడు వెతుక్కోవలసి వచ్చింది.

ఆ ప్రయత్నంలో జరిగిన ఆలస్యానికే ఉత్తరంలో చురక వేసింది రాధ. నవ్వుకోక ఏంచేస్తాడు?

సాయంత్రం ఇంటికి వస్తూనే తన తాతగారి చిత్రపటాన్ని మొదటి గది గోడకి తగిలించాడు. రామూతాతకి 'పూర్ణమిదం తాత'అని ముద్దు పేరొకటి పెట్టింది రాధే. అందుకే ఇంట్లోకి అడుగు పెట్టగానే రావమ్మా! రా! అని ఆప్యాయంగా పలుకరించేలా కనపడాలని రాంబాబు చేసిన ప్రత్యేక మైన ఏర్పాటు అది.

పాలతో తడిపినట్టు తెల్లని బుగ్గమీసాలూ – ఆ మీసాలలో దాగిన ముసిముసి నవ్వులా చిత్రపటంలో మిగిల్చి పైకి వెళ్లిపోయాడు.

తాతే తన పలుకుబడిని బరువుగా ఈమనవడి పక్కాన వెయ్యకపోతే రాద్ధాంతాలు లేకుండా పెళ్ళి జరిగేదా? అని తలుచుకోగానే రాంబాబు కళ్ళు చెమ్మగిల్లాయి. తియ్యని ఆలోచనలు ఇంకాస్త వెనక్కు పోయాయి.

★★★

పెరటింటి వాళ్ళ జామిచెట్టు రామూ వాళ్ళ గోడమీంచి తొంగి చూసేది. జామకాయలు కొల్లగొట్టే పథకం వెయ్యడం రాధపని. దాని నిర్వహణ బాధ్యత రామూది.

చెట్టు క్రింద నిలబడి –" అదిగో నీతల మీదనే బాగా పలుకుబారిన జామకాయ. చెట్టుమీదనే తిన్నా వంటే నేను ఒప్పను. ఇద్దరికీ చెరో సగం" అని హెచ్చరించేది రాధ.

వరండాలో పచార్లుచేస్తున్న తాత పిల్లల ఆటపాటల్ని ఓకంట కనిపెడుతూ ఓ చెవినివింటూ తన చిన్నతనాన్ని గుర్తుకు తెచ్చుకొనేవాడేమో కానీ చిరునవ్వుల్ని పండుమీసాల్లో దాచుకునేవాడు.

పూర్ణకుంభం లాంటి బొజ్జను చేత్తో నిమురు కుంటూ, పసి పిల్లాడినీ పండు ముసలినీ కలిపి కరిగించి పోసిన విగ్రహంలా ఉండేవాడు.

" ఇదెవర్తి ? నా ఇంటి పొరుగునే దాపరించింది. రెండు పిలకజడలు, చేతిలో ఒకబెత్తం, మగరాయుడులాగ ఆటలు" అంటూ రామూ తల్లి విసవిసలాడి నప్పుడూ, కోపంతో కసురుకున్నప్పుడూ కాసింత కలగజేసుకునేవాడు తాత.

"తల్లిలేని పిల్ల. మేనత్త పెంపకం. ఇక రెండు రోజులు పోతే ఇలాగే ఆడుతుందా

ఏమిటి? చిన్న తనం" .... అని రాధని వెనకేసుకు వచ్చేవాడు.

అలా రెండేళ్ళు గడిచిపోయాయి.

ఆటల సందడిలో పిల్లవాడు ఇల్లు విడిచి ఎండల్లో గట్లమీదా పుట్టల మీదా తిరక్కుండా నీడపట్టునే ఉండాలని క్యారమ్ బోర్డు ఒకటి కొనిపడేశారు రామూ తండ్రి. దాన్ని ఎలా వినియోగించాలో నేర్పింది తాతే.

క్యారమ్ బోర్డు మధ్య వర్తులాకారంలో ఉన్న పరిధిలోనికి గుండ్రంగా ఉన్న కాయిన్స్‌ని ఒక్కటొక్కటే పేర్చి పిల్లలకేమీ అర్థంకాని మంత్ర మేదో చదువుతూ, 'పూర్ణమదః పూర్ణమిదం' అంటూ ఇక కొట్టండిరా ఈ స్ట్రయికర్‌తో అనేవాడు.

నేను ముందుకొడతానని ఇద్దరు పిల్లలూ పేచీపడుతూ వుంటే అప్పుడు తన మొలలోని గుడ్డమడత లోంచి ఒక పావులా నాణెం తీసి బొమ్మకావాలా ? బొరుసుకావాలా ? అని అడిగి పిల్లలు పేచీ పడకుండా ఆట ప్రారంభించే చిట్కా కూడా చెప్పాడు. పిల్లలు ఆడుకుంటూ వుంటే పరవశాన చదివే మంత్రానికి నవ్వుకుంటూ పూర్ణమిదం తాతగారని ఒక ముద్దుపేరు పెట్టేసింది ఆ ముసలాయనకి రాధ. అలాంటి సమయాల్లో రామూ తల్లి పార్వతికి మిరప్పొడి ఒంటికి రాసుకున్నట్టు అనిపించేది.

" ఈ క్యారంబోర్డు కొనిపడేశాక ఈ చిన్న గుంట మనచూరు పట్టుకుని వదలకుండా వేలాడుతోంది. దాని అత్త గట్టిగా అరిచి పిలుస్తేనే కానీ తిండి కైనా లేచి వెళ్ళదు." అని రుసరుసలాడేది. ఎప్పుడైనా తన తమ్ముడి కూతురు పుట్టింటి నుంచి శెలవల్లో వచ్చినప్పుడు రాధను చూసి కసురుకోవడం ఇంకా ఎక్కువైపోయేది.

పిల్లలు యుక్తవయస్కులైనాక, రాంబాబు ఉద్యోగస్థుడై పెళ్లి విషయం ప్రస్తావనకు వచ్చిన తరుణంలో పార్వతి విసవిసల వెనుక ఉన్న కారణం స్పష్టరూపంలో బయటపడింది.

పెళ్ళి సంబంధాన్ని అడ్డుకోవాలన్నా తిరస్కరించాలన్నా అయిష్టతను ప్రకటించాలన్నా కొన్నిపదాలుంటాయి. వాటిని ఒక్కొక్క తురుపుముక్కలా వాడి చూసింది. రాధతో పెళ్లి జరగడానికి ససేమిరా వీలులేదంది. కులంఅంది, గోత్రంఅంది. నక్షత్రం అంది, జాతకం అంది, కట్నం, ముద్దూముచ్చటా అంది. చివరికిమనసులో వున్నటువంటి బలమైన కోర్కెను కూడా బయటపెట్టింది.

" అత్తయ్యా ! అత్తయ్యా! అని నా చుట్టూ చనువుగా తిరిగి కాసింత తలనొప్పిందంటే

తలపట్టినా అని అడిగే మేనకోడల్ని కాదని వేరేదాన్ని ఎలా చేసుకోవడం" అంది,

భార్యకున్న తీవ్రమైన ఇష్టాఇష్టాలు విన్న రామూ తండ్రి, ఏమీ చెప్పలేని ఇరకాటంలో పడిపోయాడు. నయ్యాగొయ్యా అన్న పదాలు కూడా భార్యనోటి వెంట వెలువడ్డాయి. ఇక అలాంటి పరిస్థితిలో తన పాత్ర ఉందని అర్ధంచేసుకుని రంగప్రవేశం చేశాడు పూర్ణమిదం తాత.

గంభీరమైన ముద్రవేసుకు కూర్చున్న కోడల్ని సమీపించాడు. "చూడమ్మాయి ! ఇవి బాల్యవివాహాల రోజులు కావు. చదువుకుని ఎవరికాళ్ళ మీద వాళ్లు నిలబడే వయసులో జరిగే పెళ్లిళ్లు . ఎవరి బ్రతుకుల్ని వాళ్ళేతీర్చి దిద్దుకోగల అవకాశం మనం ఇవ్వకపోతే ఎలా ?

అంతేకాదు ఈనాటి వైద్యశాస్త్రం దగ్గర రక్తసంబంధాలలోనే పెళ్లిళ్ళు వద్దని మందలిస్తోంది. నువ్వు కోరినట్లు నీకు తలపట్టి నీ మాట వినే కోడలే కావాలనుకుంటే నీ కొడుకు మనసును ఆకట్టుకుని ఆనందం పంచే కోడలు దొరకదుకదా.

పిల్లల్ని కనిపెంచిన వాళ్ళే ప్రతిఫలాపేక్ష ఉంచుకుంటే ప్రేమకి అర్థమేమిటి ? నూతిలో గోతిలో పడతానని బెదిరించి సంపాదించుకున్న వినయవిధేయతలకు శాశ్వతమైన పునాది ఉండదు. నీకు తృప్తి ఉండదు." అన్నాడు.

అలా రామూ తాతగారు ఒకకాలు ముందుకు వెయ్యడంతో రామూ తండ్రికి కాసింత బలం, వెసులుబాటు కలిగింది. పార్వతమ్మ పట్టుకూడా సడలింది. పెళ్ళి నిశ్చయమైనాక "మాతాత అంటే ఏమిటనుకున్నావ్ " అన్నట్టు విజయగర్వంతో రామూ చూశాడు రాధవేపు.

అలాటి తాతనీ ఏలాటి తల్లినీ ఎరగకుండా పెరిగిన రాధ కళ్ళు చెమ్మగిల్లాయి. అది చూసి అర్థంకాక రామూ తెల్లబోతే - చిరునవ్వుతో కళ్ళు తుడుచుకుని అవి ఆనందబాష్పాలే సుమీ అన్నట్లు నవ్వింది రాధ. మరి అలాంటి తాతకూడా కారణజన్ముడిలా తనకు మిగలకుండా వెళ్ళిపోయాడని మనసులో బాధపడ్డాడు, చిత్రపటాన్ని చూస్తూ నిలిచిపోయిన రాంబాబు.

★★★

ఇల్లంటూ దొరికితే ఇక ఆలస్యం చేసే రకం కాదు రాధ. రెక్కలు కట్టుకు వాలింది.

మరునాడు వేకువనే రెండు చేతుల్లో రెండు కాఫీ కప్పులతో వచ్చి రామూ కోసం వెతుక్కుంటూ వుంటే ఉత్తర దిశగా ఉన్న బాల్కనీలో నిల్చుని నిశ్చలంగా చూస్తున్నాడు.

" కాఫీ వేడిగా ఇద్దామనుకుంటే పిలిచినా పలికేలాలేవు. ఆ ఇంట్లో గాళ్‌ఫ్రెండు ఉందా ఏమిటి?" అంది గలగల నవ్వుతూ.

" కాదుకాదు. నీకు చక్కని బాయ్‌ఫ్రెండే. అటు చూడు" చిన్నగరిటకాడతో ఏదో మొక్కకు గొప్పు త్వ్వుతూ వెన్ను మాత్రం చూపుతూ వెనుతిరిగి ఉన్న శాస్త్రి కనపడ్డాడు.

తెల్లని గరిక మొలిచినట్టు పలుచగా ఉన్న తలకట్టూ, కాసింత మాసిన గడ్డం వడలిన శరీరంతో డెబ్భై దాటిన వృద్ధుడు రాధకు కనపడ్డాడు.

" ఎవరీ ముసలాయన ?" అడిగింది రాధ.

" నీకన్నా రెండు వారాలు ముందు వచ్చి. ఇంట్లో చేరాను. నాకు మాత్రం ఏమి తెలుసు? పరీక్షలు రాసి ఫలితాలకు ఎదురుచూస్తున్నదానివి. ఈ లోగా పరిశోధనకు మంచివస్తువు దొరికింది." చిలిపిగా నవ్వాడు రాంబాబు.

భోజనం ముగించి స్కూటర్‌మీద రామూ వెళ్ళిన తర్వాత ఇల్లంతా ఒకమారు ఊడ్చి, ఎక్కడి వస్తువులక్కడ సర్ది నాలుగువేపులా కలయ జూసింది. ఆ మేడకు ఎదురుగా కొంత వరకూ కట్టి ఆపేసిన ఇటుకలగోడలు, కుడివేపునా, వెనుక వున్న వీధిలోనా ఒకరి మొహం మీద ఇంకొకరు మొహం పెట్టినట్టు దగ్గరగా కట్టేసుకున్న ఇళ్ళ దొంతరలున్నాయి. చెట్టూచేమా మచ్చుకైనా లేదు సరికదా, ఇంటికీ ఇంటికీ మధ్యకాసింత వెలుగూ గాలీ పారేటంతస్థలం కూడా మిగలనివ్వకుండా కట్టేసుకున్నారు ఇళ్ళు.

ఇంత కన్నా కాస్త మంచికాలనీలో ఇల్లుదొరికితే నెమ్మదిగా మారిపోవాలనిపించింది. పడకకుర్చీ వాల్చుకుని ఇంటికి ఎడమ చేతి వేపున్న బాల్కనీలో ఏదో పుస్తకం పట్టుకుని కూర్చుంది.

ఆ జనావాసాలకు ఒక అపవాదులాగ ఒకపాత మిద్దె, చుట్టూతా కాసిన్ని పచ్చని చెట్లూ కనిపించాయి. అందులో ఒకటి జామచెట్టులా ఉంది. దానిమీద ఏదో కలకలం. పొడుగాటి తోకలు క్రిందికి వ్రేలేసుకుని నాలుగు కొండ ముచ్చులు తీరికగా పేలు చూసుకుంటూ వుంటే, రెండు చిన్న పిల్ల కోతులు రెమ్మలు విరుస్తూ కాయల్ని ఏరి కొరికి పడేస్తూ స్వైరవిహారం చేస్తున్నాయి.

అదే చెట్టుకి దగ్గరగా నీడలో కూర్చుని వార్తా పత్రికను చదువుకుంటున్నాడు వృద్ధుడు. ఆ పెరటిలో ఇకవేరే మనిషి సందడే లేదు.

ఎవ్వరీ ముసలివాడు ? ఎందుకీ ఒంటరి జీవితం ? అన్న ప్రశ్నలు వేసుకుని వాటి సమాధానం వెతుకుతూ తీరిక సమయంలో బాల్కనీలో కూర్చుని వారం రోజులు గడిపింది రాధ.

రామూ ఆఫీసు నుంచి వచ్చిన తర్వాత కూడా హాయిగా ముచ్చటలాడుకుంటూ గడపటానికి ఆ బాల్కనీ చాలా అనువుగా ఉంది. ఎదరగా పచ్చని చెట్లూ వాటి మీద వాలే పిట్టలు. అదొక చిన్న తపో వనంలా ఉంది. ఉదయాన్నే ఒక మధ్య వయస్కురాలు వచ్చి వాకిట్లో ముగ్గేసి, గిన్నెలు తోమి వెళ్ళిపోతూ వుంటుంది . అప్పుడప్పుడు సాయంత్రం కూడా ఒకమారు వచ్చిపోతూ వుంటుంది.

ఒక ఉదయం అలా వచ్చి వెళ్ళిపోతున్న వేళ ఆమెను పిల్చింది – రాధ. " ఈ ఊరికి కొత్తగా వచ్చాం. నాకూడా కొంచెం పనిలో సహాయం చేస్తావా ?" అని అడిగింది ప్రేమగా. తాను ఊహించినంత సులభంగా సమాధానం మాత్రం రాలేదు.

" నాకు తీరదమ్మా. అవసరమూ లేదు. నా పిల్లలు మంచిగ చూసుకుంటరు. ఈ అయ్యా ఒక్కడే ఉంటడు. చానాకాలం పట్టిజేస్తుంటి. ఇడవ బుద్ధిగాక ...." అని నెమ్మదిగా చెప్పింది.

అలా చెప్పి వెళ్ళిపోబోతున్న మనిషి ఒక్క క్షణం ఆగి " ఎవరన్న జేస్తనంటె నీకాడకంపుతొ అని కాసింత మెత్తపడింది.

ఆ అవకాశం వదలుకోలేదు. మాటలాడే మనిషి కరువైనట్టు ఏమీ తోచక నిలుచున్న రాధ ఆ పని మనిషిని విడిచి పెట్టకుండా మాటలు కలిపి ముసలాయన గురించి ప్రశ్నలు వేసి తెల్సుకుంది.

" ఆయన ఈ వయసులో ఒంటరిగా ఎందుకు ఉంటాడు ? పిల్లలులేరా ?" అన్న ప్రశ్నకు సమాధానం దొరికింది.

" ఉన్నారు ఇద్దరు కొడుకులు. పెద్దాయన పై దేశం పోయి అక్కడ బిడ్డనె మనువాడిన్డు. ఈ దేశంల ఉండడు.

ఇంకొకాయన తెలుగుబిడ్డని పెళ్లి జేసుకున్నడు గానీ పెళ్లయినాక కొంతకాలముండి ఏడకోపోయిండు. ఈడ కెన్నడూ రాడు. ఈ అయ్యకూ కోడలికి సరిపడలేదు.

" మరి పైదేశాల్లో ఉన్న కొడుకూ కోడలు ఎప్పుడైనా ఇక్కడికి వస్తారా ?" అని అడిగింది రాధ.

" ఎప్పుడైన వస్తరు. ఈడనే ఉంటరు. మల్లఎల్లిపోతురు. ఆలిద్దరితో ముసలాయన చానఖుషీ గుంటడు. ఆడతాడు. పాడతాడు. అందరు కలసి బువ్వతింటరు. చూడముచ్చట గుంటరు.

ఆబాస నాకైతే తెల్వదుగానీ కోడలు మామచాన మాటలాడుకుంటరు."

అలా పనిమనిషి చెప్పిన సమాధానం వింటే రాధలో చెప్పలేనంత కుతూహలం మొలకెత్తింది. తెలుగు మాటలాడే కోడలితో పడనివాడు పరాయి దేశపు పిల్ల కోడలుగా వస్తే ఆనందంగా గడపడం వింతగానే తోచింది.

ముసలాడు పంతగొట్టువాడై వుంటాడు. ఈ వయసులో పంతాలు పట్టింపులు ఎందుకో?

ఈ ప్రశ్నకు సమాధానం తానే స్వయంగా సంపాదించాలనుకుంది. ఇంట్లోకి అడుగుపెడితే కసిరి పొమ్మనడుకదా అన్న ఆలోచనరాగానే తనలో తానే నవ్వుకుంది.

అనుకోకుండానే పొరుగింటి వృద్ధుణ్ణి కలుసు కోవలసిన అవకాశం రానే వచ్చింది. బాల్కనీలో ఎండకు ఆరబెట్టిన బట్టలు తీస్తూ వుంటే ఒక ఓణి జారి గాలికిలేచి ముసలాయన ఇంటి వాకిట్లో పడింది. తెచ్చుకుందామని పోయి తలుపుతట్టింది.

తలుపుతీసి నవ్వుతో మూసుకుపోయిన కళ్ళ లోంచి విచిత్రంగా చూశాడు.

"' ఆ మేడమీద వాటాలోకి కొత్తగా వచ్చాం' అంటూ తత్తరపాటుగా చెప్పుకొస్తున్న రాధ మాటలకు అడ్డువస్తూ-

" నీ ఓణీ ఇప్పుడే మా ఇంట్లోకి జారిపడిపోయి నట్టుంది. నేను తీసి ఇద్దామనుకుంటూవుంటే ఇంతలో నువ్వే వచ్చావు."

"పెద్దవారు ఏమనుకొంటారో, లోనికి రావడానికి సందేహిస్తున్నాను. నిష్ఠా నియమం-"

"సందేహం దేనికి? నిష్ఠా నియమాలు ఆరోగ్యంగా సంతోషంగా బ్రతకడానికీ కానీ మనుష్యుల్ని దూరం చెయ్యడానికి కాదుకదా !"

ఓణీని అందుకుని మడత పెట్టి వెళ్ళిపోబోతున్న రాధను నిలిపి మాటలతో

ఆశ్చర్యపరచాడు.

"పెళ్లయిన ఆడబిడ్డవు. అందులోనూ ప్రేమించి సాహసించి చేసుకున్న వివాహం. తొలిసారి మా ఇంట్లోకి అడుగుపెట్టి పసుపూకుంకం తీసుకెళ్ళకుండా అలా వెళ్ళిపోతే ఊరుకుంటానా ? అన్నాడు."

"మీకెలా తెలుసు మా వివాహం వివరాలు...."

"ఏడు దశాబ్దాల జీవితం చూసినవాణ్ణి. రోజూ మీ బాల్కనీ మీంచి మాటలు, ఛలోక్తులు చెవిని పడుతూ వుంటే ఆ మాత్రం అర్థం చేసుకోలేనూ ? పైగా అత్తా, అమ్మా వెంటలేకుండా నువ్వు ఒక్కతెవే వచ్చావు. మీ ఇద్దరి వాచికంలోనూ కాసింత తేడా వినిపిస్తోంది...."

"అయ్యబాబోయ్ !షర్లాక్‌హోమ్స్‌లా ఉన్నారే"

"అదేం కాదు. పురాతన తత్త్వశాస్త్రం, భాషాశాస్త్రం, చరిత్రా కాసింత పరిచయం ఉన్నవాడిని. విన్నమాటలు, కన్న దృశ్యాలు నన్ను సులభంగా విడిచిపెట్టవు కదా !"

"మీరు ఒక్కరే ఉంటున్నారా ?"

"లేదు. నాతోపాటు ఒక ముసలిపిల్లి, చెట్లూచేమా?" అంటూ గలగలనవ్వాడు వృద్ధుడు. రాధ శ్రుతి కలిపింది.

"అర్థమైంది నీ ప్రశ్న. నాకు ఇద్దరే కొడుకులు. కూతుళ్ళులేరు. అందుకే మా ఇంటికి తొలిసారిగా వచ్చిన నిన్ను ఇంట్లోకి వచ్చి పసుపూ కుంకుమా తీసుకుని మరీ వెళ్ళ మంటున్నాను ..." అని ఆహ్వానించాడు.

నిజానికి ఇంట్లోకి వెళ్ళాలనీ –వృద్ధుడి జీవిత విధానమేమిటో తెలుసుకోవాలనీ రాధకీ కోరిక ఉంది. లోనికి అడుగుపెడుతూ 'ఆడ పిల్లలంటే ఇంత అభిమానం ఉన్నవాడికి ఈ దేశంలో ఉన్న ఒక్క కోడలితోనూ ఏకారణంగా విరోధమో' అని మనసులో అనుకుంది.

ఇల్లు నిరాడంబరంగా ఉంది. పాతకాలపు నలుపు తెలుపు ఫోటోలు పాత ఫ్రేముల్లో గోడలకు వ్రేలాడుతున్నాయి.

వాటిమీద పేరుకున్న సాలెగూళ్లు. వృద్ధుడు గదిలోకి వెళ్లి వచ్చేలోగా ముందుహాలులో నిలుచుని ఇంటిని పరికిస్తోంది.

పసుపూ కుంకుమా ఒక జాకెట్ గుడ్డ, రెండు బాగా పలుకు బారిన జామకాయలు ఒక

పళ్ళెంలో పెట్టి తీసుకు వచ్చాడు.

" మీ చెట్ల మీద కోతుల దాడి బాగానే ఉంది. మరి మీకు తినడానికి జాంపళ్ళు మిగులుస్తున్నాయా ?" రాధ అడిగింది.

" పెరటిలోని చెట్ల మీదా పళ్ళమీదా తొలి అధికారం వాటిదే. అవి తినగా మిగిల్చినవే మనకి ప్రసాదం. నాకు ఒంటరితనం లేకుండా అప్పుడప్పుడు వచ్చిపోయే ముఖ్య అతిథులు అవి.

నేనీ ప్రాంతానికి వచ్చిన కొత్తల్లో ఇక్కడ తోట ఉండేది. క్రమంగా ఇళ్ళూ కాంక్రీటుగోడలూ మొలుచుకు వచ్చాక కోతులు ఎక్కడికో వలసపోయాయి పాపం. అయినా పాత వాసన పోక ఎప్పుడైనా వచ్చి ఇలా పలకరిస్తూ వుంటాయి." వృద్ధుడి మాటలు స్పష్టంగానే ఉన్నాయి.

ఆకంఠంలో ఏదో స్నేహం, ఆత్మీయత రాధను మంత్రించి పడేశాయి. వృద్ధుడు అడిగిన ప్రశ్నలకు స్పందించి – శైశవంలోనే తల్లిని పోగొట్టుకున్న తన బాల్యం, రామూతో స్నేహం, వివాహం అంతా వివరించి ఎన్నడూ ఎరగని ఉపశమనం పొందింది.

" పూర్ణమిదం తాతగారు కూడా నాతో ఇలానే చనువుగా గడిపేవారని" అంటూ నాలికను చిన్నగా కరుచుకుంది.

" ఏమన్నావ్ ? ఏం తాతగారు ? అదేం పేరు" అన్న ప్రశ్నరానే వచ్చింది రాధ ఊహించినట్టుగా.

" నిజానికి మావారి తాతగారి పేరేమిటో నాకు తెలియదు. పూర్ణమిదం తాతగారని నేనే వారికి అలా పేరు పెట్టాను. మాకు క్యారమ్‌బోర్డులో కాయిన్స్‌ని వలయాకారపు పరిధిలోకి పేర్చి ఏదో సంస్కృతంలో చదివి ఇక ఆడుకొండని ఆట ఎలా ఆడాలో నేర్పేవారు.

ఆ మంత్రమేదో అర్థంకాకపోయినా చిన్నతనంలో మాకు చాలా సరదాగా ఉండేది. అందుకే వారిని పూర్ణమిదం తాతగారిని పిలిచాను. అలా పిలవడమే అలవాటైపోయింది నాకు.

ఆ మాటలు వింటూ ఒక్కక్షణం ఆలోచనలో మునిగిపోయాడా వృద్ధుడు. యాంత్రికంగా పెదవులు కదిపి, రెండు కళ్ళూ మూసుకుని.

" ఓం–పూర్ణమద ః పూర్ణమిదం – పూర్ణాతత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే –"

అని రామూ తాతగారు పలికినట్లే చదివాడు. హాయిగా నవ్వాడు.

" అంతటి హృదయవైశాల్యం ఉన్నవాడు కాబట్టే ఆయన మీ ఇద్దరినీ కలిపి మనస్ఫూర్తిగా దీవించాడు. క్యారమ్ బోర్డు మీద వలయాకారంలో గుండ్రని కాయిన్స్‌ని కూర్చి శాంతిమంత్రం జపించిన రామూతాత ఎంతటి భావుకుడు !

ఎంతటి జ్ఞాని ! మనసులో అద్వైతసిద్ధిని పండించుకున్నవాడన్నమాటే.

అక్షరాల్ని ఊరికే వల్లెవేస్తే ఏం లాభం ? వాటిలోని పరమార్థాన్ని జీర్ణించుకోవడం ఆచరణలోకి తీసుకురావడం ఎందరికి సాధ్యం ? విశ్వ సౌందర్యంలోని సమగ్రస్వరూపాన్ని అర్థం చేసుకున్నవాడే పూర్ణమిదం తాత ," అన్నాడు. చిన్న ఉపన్యాసం ముగించినట్లు పారవశ్యంతో.

" మీపిల్లలిద్దరికీ పెళ్లిసంబంధాలు వాళ్ళే ఎంచుకున్నారా ? మీరే ఎంపిక చేశారా ?" రాధ ప్రశ్నలో పూర్వపు సందేహం బెరుకూలేదు. ఏదో చనువు ధ్వనించింది.

"వాళ్ళ భార్యల్ని వాళ్ళే ఎంపిక చేసుకున్నారు. నేను దీవించి అక్షింతలు వేసి పెళ్లి చేశాను."

"ఇలా ఒంటరిగా ఉంటే మీకు కష్టంగా ఉండదూ ?" అడిగిందామె.

"ఎక్కువ కాలం ఇలా ఉండను. నా పెద్ద కొడుకూ కోడలూ పిలుస్తూనే ఉన్నారు".

తనంతతానుగా రెండవ కొడుకూ కోడలు గురించి ఏమీ చెప్పనేలేదు. రాధ సందేహం మనసులోనే ఉండిపోయింది, తొలి పరిచయంలోనే అంత కన్నా అడిగితే అదిక ప్రసంగంలా ఉంటుందని పళ్ళెంలోనివి చేత్తోపట్టుకుని సెలవు తీసుకుని తన ఇంటికి వచ్చేసింది.

"మీవారిని కూడా తీసుకుని రావాలి." అని సాగనంపాడు వృద్ధుడు.

★★★

రాధకి పొరుగింటి వృద్ధుడు అర్థంకాని మహాకావ్యంలా ఉన్నాడు. మడీ ఆచారం అంటాడేమో అనుకుంటే చాలా నవీనుడిగా కనిపిస్తున్నాడు. అలాగని, సంప్రదాయాన్ని తోసి రాజు అనే రకం కాదు. తొలిపరిచయం అని పసుపూ కుంకుమతో సాగనంపాడు. ఎవరో పక్కింటి అమ్మాయి ఓణీ వాకిట్లో వచ్చి పడింది. అదే వచ్చి తీసుకుంటుందని నిర్లిప్తంగా ఊరుకోలేదు.

తన అత్తగారు మరచిపోలేని తరతమ భేదాలు ఈ ముసలివాణ్ణి బాధిస్తున్నట్టు లేదు.

సీమనుండి వచ్చిన పరదేశీ కోడలుతో హాయిగా ఉండగలవాడు – తెలుగింటి అమ్మాయి కోడలుగా వస్తే మాటా మాటా పెంచుకున్న విచిత్రం ఏమిటో తెలుసుకోవాలని అనుకుంటూ ఇంటి పనులలో నిమగ్నమైపోయింది.

ఒక ఉదయం రామూ ఆఫీసుకి వెళ్ళగానే వంటింటి పనులు చక్కపెట్టుకుని వార్తాపత్రికను తిప్పుతూ కాలక్షేపం చేస్తోంది. పత్రిక అంతా ఘర్షణలమయం. కులమో, మతమో, అధికారదాహమో, వాటికి మూలం. సంకీర్ణ ప్రభుత్వంలో సిగ్గుమాలిన రాజకీయ షరతులు, పేచీలు. పత్రికను ప్రక్కకు నెట్టి తన రాబోయే పరీక్షా ఫలితాల గురించి కొంతసేపు ఆలోచించింది.

తన సాటి వాళ్లు ఎవరైనా ఇరుగు పొరుగున ఉన్నారేమో అని పరిచయం చేసుకునే ఉద్దేశంతో మిగిలిన దిశల వేపు చూసింది.

రామూ వచ్చేదాకా ఒంటరిగా గడపడం ఏమంత సులభం కాదని అనుకుంది. పరీక్షా ఫలితాలు వచ్చేక ఏంచెయ్యాలో – ఏ వస్తువు పరిశోధనకు ఎంపికచేసుకోవాలో నిర్ణయించుకుని పుస్తకాల సేకరణ చెయ్యాలనీ దానికి సలహా వృద్ధుణ్ణి అడిగితే బావుంటుందనీ ఊహించింది.

ఇంతలో బాల్కనీదిశగా వృద్ధుడి గొంతు వినిపించి, అటువేపు చూసింది. ఒక కుర్రవాడు పొడుగాటి వెదురుబొంగును పట్టుకొని కొబ్బరి చెట్టు క్రింద నిలబడి కొబ్బరికాయను రాల్చే ప్రయత్నం చేస్తున్నాడు. పచ్చని కొబ్బబరికాయలు వెదురుకొన తగలగానే అటూఇటూ తప్పించుకుని జరిగిపోతున్నాయి కానీ రాలిపడడం లేదు. మీదకు తల ఎత్తి చూసిచూసి మెడ నరాలు లాగుతూ వుంటే విసవిసలాడుతూ అంతకన్నా పొడుగాటి వెదురు తెస్తానని వెళ్ళిపోతున్నాడు. అలా వెళ్ళిపోతూ యువకుడు అన్నమాటలకు వృద్ధుడు పగలబడి నవ్వుతున్నాడు.

"ఏమిటి తాతగారూ! నవ్వుతూన్నారం"టూ రాధ వెళ్ళి పలకరించింది.

"ఏమీలేదు. పాపం ఆకుర్రాడు రెండు పీచుతియ్యని కొబ్బరికాయలు ఏదో వ్రతానికి కావాలని చెట్టు నుంచి కోసుకుందుకు వచ్చాడు. వెదురుతో కొట్టినా, కదిపినా కాయ సులభంగా రాలిపడనందుకు విసుక్కుంటూ ఏదో తెలివితక్కువగా అంటే నాకు నవ్వు వచ్చింది. పాపం సృష్టి సంకల్పం తెలియని అజ్ఞానానికి.."

"ఆ సంకల్పమేదో నాకు చెప్పండి...." రాధ అభ్యర్థించింది.

"ఏముంది చెప్పడానికి. కొబ్బరి చెట్టు ఎత్తుగా పైకి ఎదిగి కాయలుకాసేది మన అవసరాలకికాదు కదా ! పెనుతుపానో ఉప్పెనో వస్తేఅది వేరే సంగతి. కానీ చిరుగాలికో చిన్నవానకో కాకివాలిందనో పచ్చని కొబ్బరికాయలు రాలిపడతాయా? అలా పడితే ఈ సృష్టి

నిరంతరం కొనసాగేదెలాగ?

కాయల మూచికల్ని మట్టలు బలంగా ఉడుంపట్టుపట్టి రక్షిస్తాయి. ఆకాయలు పండి మొలకెత్తగల సమయం వస్తే వడిలి వాటింతట అవే రాలిపడతాయి. అంత వరకూ గట్టిగా పట్టిన కొబ్బరి మట్ట ఆసమయం వస్తే కోరి విడిచి పెడుతుంది. నీటిలో కొట్టుకుపోయి, మట్టిలో కూరుకుపోయి మొలకెత్తి సృష్టి సంకల్పాన్ని నెరవేరుస్తాయి.

ఈ సృష్టి పథకం, ఈ రహస్యం ఆ చిన్నవాడికి ఎలా అర్థమౌతుంది. వ్రతానికి చెట్టు సులభంగా కాయను విడవడం లేదని తిట్టుకుంటున్నాడు పాపం. అందుకే నవ్వువచ్చింది."

"మీ అనుభవం - తాత్త్వికమైన ఆలోచనా నాలాటి దానికీ ఆ చిన్న కుర్రాడికీ ఎలా సాధ్యం. నాకూ మీ సలహా కావాలి. పరీక్ష ఫలితాలు వస్తే నేను ఏ విషయం పై చదువుకి తీసుకోవాలన్నదే తెలియడం లేదు."

"ప్రైవేటుగా చదువుకుని పరీక్షలు వ్రాసే సదుపాయం ఉందికదా. హ్యూమానిటీస్‌ని మరీ నిర్లక్ష్యం చెయ్యనక్కరలేదు. ఆంత్రపోలజీ, సోషియాలజీ హిస్టరీ యువతలో ఆలోచన పెంచి ఆవేశం తగ్గిస్తుంది. మనిషి ఇన్ని తరాలుగా తన శిల్పాన్ని తానే ఎంతకష్టపడి చెక్కి అందంగా తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నాడో అర్థమౌతుంది. ప్రయత్నంలో లోపాలున్నా సానుభూతి కలుగుతుంది."

"మిమ్మల్ని మాటల్లో పెట్టేశాను. ఇంకా మీరు భోజనం చేసినట్టు లేదు."

"అలాగే - నా పిల్లికి ముఖ్యంగా ఆలస్యం అవుతుంది." అంటూ రాధని లోనికి ఆహ్వానించాడు. " పిల్లి ఉంది మీ ఇంట్లో. ఎలుకల బాధ ఉండదు." అన్న రాధ మాటకు నవ్వాడు వృద్ధుడు. అర్థంకాక చూసింది రాధ. అంతలోనే అన్నంలో పెరుగువేసి కలిపిన ముద్ద చిన్న గిన్నెలో ఉంచి దానికి కాసింత దూరాన ఉంచాడు.

పిల్లిలో చలనంలేదు. అలా కూర్చుంది.

ఆహారం ముందుంచితే తినడానికి సిద్ధంగా ఏ ఆత్రం చూపకపోవడం రాధకు ఆశ్చర్యం వేసింది. ఇంకాస్త దగ్గిరగా గిన్నెను జరిపి పిల్లి ముందుంచితే నెమ్మదిగా తినడం ప్రారంభించింది.

"ఇది కనిపెంచిన పిల్లలెన్నో పెద్దవై వాటి దారి అవి చూసుకుపోయాయి. దీనికి బాగా

ముసలితనం వచ్చేసి దృష్టిబాగా తగ్గిపోయింది. సాటిపిల్లులే కాదు – పెద్ద ఎలుకలు దాడి చేసినా ఏమీ చెయ్యలేని చరమదశలో ఉంది పాపం. అందుకే నన్ను నీడలా వెంటాడుతూ వుంటుంది. ఈ ఇంటిని విడిచి వెళ్ళదు" అని దాని చరిత్రను చెప్పాడు రాధకి అర్థమయ్యేలాగ.

"అమ్మాయీ! కొన్ని ఇలాంటిపనులకు జీవితంలో ప్రతిఫలం కంటికి కనిపించదు. కానీ ఆనందం మనసుకి కలుగుతుంది." అంటూ నెమ్మదిగా భోజనానికి ఉపక్రమించాడు.

రాధ చనువుగా ఇల్లంతా కలియతిరుగుతూ ఫ్రేములోంచి జారిపోతున్న ఒక పాత ఫోటో వేపు నిశితంగా చూసింది.

ఆశ్చర్యంగా దాన్ని చేతిలోనికి తీసుకుని బూజు దులుపుతూ "ఇదేమిటి – గాంధీగారు కదూ. గాంధీ గారితో ఉన్న ఈ ఇద్దరూ ఎవరు?" అని ఉత్సాహంగా అడిగింది.

"అందులో ఏభైదాటిన వ్యక్తి–గుండ్రని మొహం, నున్నటి బట్టతల, విశాలమైన కళ్ళూ, సన్నగా గడ్డం– మీసం గీసేసుకున్న వారు నిర్మల్‌కుమార్ బోస్, కలకత్తా యూనివర్సిటీలో ఆంత్రపాలజీ చెప్పేవారు. నల్లని తుప్పతలతో పిచ్చివాడిలా ఉన్న యువకుడు–నీతో మాట్లాడుతున్న ఈ ముసలి వాడు." అని గలగల నవ్వాడు వృద్ధుడు.

"మీరు గాంధీ మహాత్ముడితో పనిచేశారా?" అని ప్రశంసాపూర్వకంగా చూస్తూ అడిగింది రాధ.

"అబ్బే అంత భాగ్యం నాకెక్కడ? రెండురోజులు వారికి దగ్గరగా మెలిగిన అదృష్టం కలిగింది."

"అదెలా?"

ఆసక్తిగా వింటున్న రాధకు క్లుప్తంగా తన గతాన్ని విప్పడం ప్రారంభించాడు.

"మా నాన్నగారు ఖరగ్‌పూర్ రైల్వే వర్క్‌షాపులో పనిచేస్తున్న రోజుల్లో నేను కలకత్తాలో కాలేజీలో చేరాను. క్విట్ ఇండియా ఆందోళన ముమ్మరంగా ఉన్న రోజులవి. చదువుకి ఎగనామం పెట్టి చెరసాలలో కొన్నాళ్ళు గడిపాను.

విడుదల అయినాక చదువుమానడం ఇష్టంలేక మళ్లా కాలేజీలో చేరాను. అప్పుడు నన్నుచేరదీసి అభిమానించినవారు నిర్మల్‌కుమార్ బోస్.

స్వతంత్రంతో దేశం ముక్కలయిపోయింది. బెంగాల్‌లో ఘర్షణలు, రక్తపాతం, అల్లర్లూ

జరుగుతున్నప్పుడు గాంధీగారికి పాదయాత్రలో సహాయ పడడానికి బెంగాలీ భాష తెలిసిన సహాయకుడు అవసరమై నిర్మల్‌కుమార్‌బోస్‌గారికి కబురు చేశారు. బోస్‌గారు కొంచెం సందేహించారు.

"నేను నిరీశ్వరవాదిని గాంధీజీకి ఎలా సహాయపడగలను" అన్నారు.

గాంధీజీ ఆస్తికులు, దైవ భక్తులు. వెంటనే గాంధీజీ నుండి వింత సమాధానం వచ్చింది.

"ఏమిటది ?" అని రాధ ఆత్రంగా వింటున్నది.

"మీరు శాస్త్రవిజ్ఞానం బోధిస్తున్నారు కదా. సత్యాన్ని ఆరాధిస్తున్నారనే దాని అర్థం. సత్యానికి దైవానికీ పెద్ద తేడాలేదు.

"మీరు సత్యాన్ని నమ్మితే చాలు నా సహాయానికి తక్షణం రండి"- అని గాంధీ గారు కోరారు.

అలా నిర్మల్‌కుమార్‌బోస్ గారు గాంధీ గారితో పర్యటనకు శాంతియాత్రగా వెళ్తా వుంటే -నేను బోసుగారితో నాకున్న చనువుతో అడిగాను. నేను కూడా వారితో ఉండేలా సమ్మతించమని.

నేను బెంగాలీ భాషను ధారాళంగా మాట్లాడగలిగేవాణ్ణి. బోసుగారు సరే అని తలూపగానే నా ఆనందం చెప్పతరం కాదు.గాంధీగారి రాజకీయ సిద్ధాంతాల గురించి యువకుడిగానాకు పెద్దగా ఏమీ తెలియదు. కానీబోసుగారితో ఒక సాహస యాత్రకు వెళ్తున్న ఆనందం, ఆవేశం అది.

అలా మేము ముగ్గురం ఒక దగ్గర నిలుచున్న సమయంలో ఏదో పత్రిక కోసం ఒక ఫోటోగ్రాఫర్ తీసిన ఫోటోను నేను అడిగి అపూర్వమైన జ్ఞాపికగా భద్రపరచుకున్నాను. ఇంకా వాస్తవిక లోకంలోకి పూర్తిగా అడుగువెయ్యని ఒక యువకుడిగా నాకు అది అమూల్యమైనదే కదా."

రాధ ఒక్కక్షణం ఆశ్చర్యంతో అచేతనంగా ఉండిపోయింది.తర్వాత తేరుకుని-

"మీరు ఎంత అదృష్టవంతులు ! అప్పుడు జరిగిన రక్తపాతం. శరణార్థుల బాధలు కొంత వరకూ చరిత్రలో చదివాను. మరి మీకు భయం వెయ్యలేదూ?" అని బేలగా అడిగింది.

'గాంధీజీ' నిర్మల్‌కుమార్ వాళ్ళ ప్రాణాల గురించి ఏ ఆలోచనా లేకుండా వీధుల్లో నడిచి వెళ్తూ వుంటే నాకు ఎందుకో వింత ధైర్యం వచ్చింది. ఆ సమయంలో నా ఆలోచనలను ఏమని చెప్పను ? మృత్యుంజయుడు అంటే మృత్యువురాని వాడని అర్థం కాదు. మృత్యుభయం లేనివాడు అని ఆరోజు నిర్వచనం చెప్పుకున్నాను.

నేను విన్న బుద్ధుడూ అంగుళీమాలుడు కథ మనసులో మెదిలింది.

కత్తులు కఠారులు, రాళ్ళూ నేలమీద పడవేసి తలలొంచుకుని నిలబడుతున్న జనాల్ని చూస్తూ వుంటే ఒక ఆదర్శాన్ని నమ్మినిర్భయంగా పాటించగల వాళ్లు ఎంతశక్తిమంతులు అనుకున్నాను." అంటూ ఎన్నెన్నో విషయాలు చెప్తూవుంటే ప్రతిమలా వింటూ కూర్చుండిపోయింది రాధ.

తర్వాత తేరుకుని, "మరి ఇక్కడికెలా ఎప్పుడు వచ్చారు ?" అని అడిగింది .

"నేనలా రెండు రోజులే వాళ్ళ వెనుక వెళ్ళగలిగాను. నా తల్లికి ఒంట్లో బాగులేదని తంతి మా బసకు వచ్చింది. ఖరగ్‌పూర్ వెళ్ళేసరికి నాతల్లిపోయింది. ఆ తర్వాత కలకత్తాలోనేచదువు పూర్తిచేసి ఆంత్రోపాలజీ చెప్పేవాణ్ణి కొన్నాళ్ళు.

ఇక్కడ యూనివర్సిటీలో సోషియాలజీ చెప్పే ఉద్యోగం ఉందని నాకు బాగా పరిచయస్థుడైన స్నేహితుడు ఉత్తరం వ్రాసి ఒత్తిడిచేశాడు.

ఉద్యోగంలో సులభంగా స్థిరం చేస్తారని తెలిసి ఇటువచ్చి సంసారిక జీవనంలో పడి ఒక కుటుంబరావుగా మారిపోయాను. ఇదీ క్లుప్తంగా నాకథ. " అని పూర్తి చే శాడు.

ఆ సాయంత్రం రామూ కొత్త ప్రతిపాదనతో ఇంటికి వచ్చాడు."ఇంతకన్నా మంచి ఇల్లు పదిహేను రోజుల్లో ఖాళీ అవుతుందట. ఆఫీసులో ఒకాయన చెప్పాడు. అంతేకాదు. ఇంకో విచిత్రమైన వార్త కూడా అతనే చెప్పాడు. మన పక్కింటిముసలాయన చాలా పట్టుదల మనిషట., పేచీకోరట. అతని రెండో కోడలితో మాటామాటా వచ్చి ఒంటరిగా ఉంటున్నాడట,

రెండో కొడుకూ కోడలు మన రాష్ట్రంలోనే ఉన్నా ఎన్నడూ గుమ్మంతొక్కరట. ఎందుకైనా మంచిది. మనం కూడా అతనితో జాగ్రత్తగా ఉంటేనే మంచిది." అన్నాడు.

రాధకు ఆ వార్త సులభంగా నమ్మశక్యం కాలేదు. ఒకే వ్యక్తి రెండు విభిన్నరూపాల్లో ఉండటం ఎలా సాధ్యం అనుకుంది.

మాటమంతీ లేకుండాఅలాగేలే – చూద్దాం అన్నట్టు మౌనంగా ఉండిపోయింది.

★★★

రెండురోజులు తర్వాత ఒక ఉదయం రామూని ఆఫీసుకి పంపి ఇంటికి తాళం వేసి పక్కింటికి వెళ్ళింది. వృద్ధుడు తీరికగాకూర్చుని ఉన్నడు. కాసింత దూరాన పిల్లి కూర్చుని కునుకుతోంది. రావమ్మా రాధా రా ! అని చూడగానే ఆహ్వానించాడు. రాధకు వృద్ధుడు కొత్త రూపంలో కనిపిస్తున్నాడు. ఇలాఏర్పడ్డ చనువుతో తన మనసులోనిప్రశ్నకు ఎలాగైనా జవాబు రాబట్టాలని ఉత్సాహ పడింది. ఆ ప్రయత్నంలో ఇంకో రోజుకైనా వాయిదా వెయ్యాలని అనిపించలేదు.

"చనువు తీసుకుంటున్నందుకు ఏమీ అనుకోరని నమ్మకంతో ఒకప్రశ్నవేస్తున్నాను...." అంటూ సందేహిస్తున్న రాధను చూసిన వృద్ధుడి చూపు ఎంతో ధైర్యాన్నిచ్చింది.

"మీకు మీ చిన్నకోడలికి వచ్చిన అభిప్రాయ భేదం ఏమిటి ? ఎందుకిలా ఒంటరిగా ఉండి పట్టుదలగా కష్టపడుతున్నారు ?" అని తెగించి అడిగింది.

"నా ఆత్మ తృప్తిని విడిచి పెట్టుకుని ఏమాత్రం ఇష్టం లేని పని చెయ్యమని నన్ను కోరడం – అలా నే చెయ్యలేకపోతే అపజయం కలిగినట్టు అనుకుని ప్రతిష్ఠకు సంబంధించినంతగా బాధపడ్డం న్యాయం కాదు." అన్నాడు.

"ఆమె కోరిందేమిటి ?"

"వాళ్ళ బాబాయ్ ఎవరో సెక్రెటేరియట్‌లో ఉన్నతమైన అధికారంలో ఉన్నాడట. ఒక్క కాగితం నేను సంతకం చేసి ఇస్తేచాలు స్వాతంత్ర్యసమర యోధుడుగా నాకు పింఛనూ, ఇంకా ఎన్నో సదుపాయాలూ ఇప్పిస్తానన్నాడట. ఆమెకు ఉన్న వేలువిడిచిన తాతగారికి అలాటి సదుపాయం ఇదివరకే ఇప్పించాడట కూడా."

" మీరు అలా కాగితం ఇవ్వడానికి అభ్యంతరం దేనికి ? మీరు కూడా చెరసాలలో ఉండి దేశానికి సేవచేశారు కదా !"

వృద్ధుడు విషాదఛాయతో చిరునవ్వు నవ్వాడు. "కొన్ని ఇష్టా యిష్టాలు నాకు ఉండడం నేరమా ? ఆ పింఛనూ ఆ బిరుదూ నాకు లేకున్నా గడుస్తుంది. ఎంతో ఆత్మానందంతో నేను బ్రిటీష్ వలస విధానాన్ని ఎదిరించిన తృప్తిఇలా ప్రతిఫలం కోసం వెంపరలాడితే ఉంటుందా ?అన్ని పనులూ ప్రతిఫలం కోసమేచేసే వాణిజ్యం కాదమ్మా జీవితం అన్నాడు బాధగా.

"మరి మీ కోడలు తాతగారికెవరికో ఆ సదుపాయం వచ్చింది కదా ?" రాధ ప్రశ్న.

"అది అతని ఇష్టం. అంతేకాదు – అతనికి ఎలా తప్పుడు సమాచారంతో ఆసదుపాయం

అందిందో తెలిసిన తర్వాత అలాటి పింఛను కోసం కాగితం పెట్టుకునే ఆలోచనే అసహ్యంగా తోచింది నాకు"

"ఎందుకూ?"

చెప్పడానికి ఎంతో బాధపడుతున్నట్టు కనపడ్డాడు. సందేహిస్తూ నెమ్మదిగా అన్నాడు.

"క్విట్ ఇండియా ఉద్యమ కాలానికి అతని వయసు కనీసం పదేళ్ళయినా కాదు.

అలా తప్పుడు సమాచారాన్ని అందించి స్వాతంత్ర్య సమరయోధుడిగా పింఛనూ సదుపాయాలూ ఇప్పించడమెంత తప్పో అందుకోవడం కూడాఅంతే తప్పు.పోనీ అలాంటి ఇబ్బంది పెట్టే ప్రశ్నలు ఇక వెయ్యకు" అని ముగించాడు ఆ రోజు ముచ్చటలు..

రాధ గాఢంగా నిట్టూర్చి సెలవు తీసుకుని తన ఇంటికి వెళ్ళిపోయింది.

మేడ మీదకు వచ్చేసరికి, తలుపుకు వేసిన తాళం కప్పను చూస్తూ రాధ ఎక్కడికి వెళ్ళి ఉంటుందా? అని ఊహాగానం చేస్తున్నాడు రాంబాబు.

"ఇవాళ కాసింత వేగం వచ్చేసినట్టున్నావ్ రామూ !" అంది తాళం తీసి తలుపు తెరుస్తూ.

"మంచి ఇల్లు ఒకటి ఖాళీ అయిందనీ, అన్ని సదుపాయాలూ ఉన్నాయనీ నా స్నేహితుడు చెప్పాడు. నువ్వుకూడా చూసి ఇష్టపడితే అందులోకి మారిపోవచ్చు .." అన్నాడు ఉత్సాహంగా.

ఆ వార్త విని ఉత్సాహంగా ఉరకలేస్తుందనుకున్న రాధ నిరాసక్తంగా ఒక్కక్షణం ఉండి పోవడంతో ఆశ్చర్యపోయాడు రాంబాబు.

"వద్దు రామూ ! నాకిక్కడే ఎంతో హాయిగాఉంది." నవ్వింది రాధ.

"నీ పూర్ణమిదం తాతగారు దూరంగా వెళ్ళినట్టే వెళ్ళి నాకోసం రూపు , రూటూ మార్చుకుని వచ్చేశారు. నాక్కూడా తాతగారున్నారు ... " అని గర్వంగా చూసింది.

**- స్వాతి (మాసపత్రిక), నవంబరు 99**